# సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

■ అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ములుగు రూరల్, డిసెంబర్ 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 16 నుంచి జనవరి 25 వరకు జిల్లాలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీ వేణుగోపాల్ సూచించారు. శనివారం ములుగు గ్రామపంచాయతీ కార్యాలయంలో సంకల్ప యాత్ర ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రెండు ప్రచార రథాలతో రోజుకు నాలుగు గ్రామాల చొప్పున సంకల్ప యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఏపీడీ బాల స్వామి, ఎస్‌బీఐ మేనేజర్ జనార్దన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి మాధవి

## కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

ములుగు రూరల్, డిసెంబర్ 16 : ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి టీ మాధవి అన్నారు. శనివారం ఆమె పోలీసు అధికారులతో లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజీమార్గం ద్వారా కక్షిదారుల కేసులను పరిష్కరించుకునేలా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి న్యాయ సలహాలు, సూచనలకైనా న్యాయ సేవాధికారి సంస్థను ఆశ్రయించవచ్చునని మాధవి తెలిపారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ ఎన్ సుభాష్‌బాబు, ఎస్సై వెంకటేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

## రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

ములుగు రూరల్, డిసెంబర్ 16 : మండలంలోని మల్లంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అంకయ్య శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ ఇటీవల మల్లంపల్లి వేదికగా జరిగిన జోనల్ స్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు అంజన్న, డేవిడ్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, గైడ్ టీచర్ రామ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఓపీఎస్ అమలు చేస్తామన్న సీఎంకు ధన్యవాదాలు

ములుగు రూరల్, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చే దిశగా నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ అన్నారు. శనివారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని ప్రకటించడం అభినందనీయమంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని సురేందర్ కోరారు.

## ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 16 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులతో పనులు చేయించుకుంటున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టీవీల్ రవి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ మండలంలోని రంగరాజపురం, కొండాపురం, చిరుతపల్లి, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో పనులు చేయించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థులు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పనులు చేయించుకుంటున్న ఉపాధ్యాయులపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు అశోక్, వంశీ, రాజేశ్ తదితరులున్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ములుగు రూరల్, డిసెంబర్ 16 : జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు శనివారం డీఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువ చేసే నోట్ పుస్తకాలతో పాటు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ పేద విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకొని వారికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, రతన్‌కుమార్, డీఎన్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


పుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో


ఆర్థిక సాయం అందజేస్తున్న సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది

## తోటి ఉద్యోగికి ఆర్థిక సాయం

ములుగు రూరల్, డిసెంబర్ 16 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలోని వైద్యులు, వైద్య సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. దవాఖానలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం తలా కొంత సేకరించారు. ఈ మేరకు శనివారం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌తో పాటు వైద్యులు, సిబ్బంది సంబంధిత స్టాఫ్‌నర్సుకు ఆర్థిక సాయం అందజేశారు. రోగులకు వైద్య సేవలందించడమే కాకుండా తోటి ఉద్యోగి అనారోగ్య సమస్యతో ఆర్థిక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని నగదును అందించడంపై పలువురు ప్రశంసలు కురిపించారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో డాక్టర్ వినయ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆరోగ్య మేరీ, హెడ్ నర్సులు విజయలక్ష్మి, పద్మావతి, రాధ, శీల, ఉదయ్‌రెడ్డి, గాజె రమేశ్, ఫజల్, వేణు, బొల్లం రమేశ్, దూడపాక రమేశ్, వినోద్ కుమార్, మహేశ్, ఇతర వైద్య సిబ్బంది తదితరులున్నారు.


నందీశ్వరుడి వద్ద ఉపాధ్యాయులతో కలిసి ఫొటోలు దిగుతున్న విద్యార్థులు

## రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, డిసెంబర్ 16 : మండలంలోని రామప్ప దేవాలయం శనివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి పదివేల మంది పర్యాటకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. ఆలయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం సరస్సులో బోటింగ్ చేశారు.

**బ్యూటిఫుల్ టెంపుల్..**

బ్యూటిఫుల్ టెంపుల్ రామప్ప అని ఇంగ్లండ్ దేశస్తుడు జాన్సన్ అన్నారు. శనివారం తన స్నేహితురాలు శశితో కలిసి రామప్పను సందర్శించి గైడ్స్ ద్వారా ఆలయ ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. రామప్ప శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని, గ్రేట్ ఆర్కిటెక్చర్ అని కొనియాడారు.

## లక్ష్మీనర్సింహస్వామికి అభిషేక పూజలు

మంగపేట, డిసెంబర్ 16 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, సంప్రదాయ పూజా క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు ముందుగా చింతామణి జలపాతాన్ని సందర్శించారు. అనంతరం గర్భగుడికి చేరుకొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా, అర్చకులు ఆశీర్వచనాలు ఇచ్చారు. పూజా కార్యక్రమాల్లో ఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

## పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

వెంకటాపూర్, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు నల్లగుంటలోని సబ్‌సెంటర్‌ను శనివారం జిల్లా ఎయిడ్స్, క్షయ, లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ పోరిక రవీందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రతి నెలా క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు అందించాలని, తెమడ శాంపిల్స్ సేకరించాలని ఆదేశించారు. పీహెచ్‌సీకి వచ్చిన చిన్నారులకు వైద్యం అందించారు. ఆయన వెంట సీహెచ్‌వో సదానందం, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.


చిన్నారికి వైద్యం చేస్తున్న డాక్టర్ రవీందర్

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ములుగు రూరల్, డిసెంబర్ 16 : గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ములుగు పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి సూచించారు. శనివారం ఆయన మండలంలోని కాసిందేవిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మర్రి రాజు, డైరెక్టర్లు వేల్పూరి సత్యం, ముస్కుల రమేశ్, సీఈవో తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్తిరెడ్డి

## ప్రజావాణిల్లో తుడుందెబ్బ నాయకులు పాల్గొనాలి

ఏటూరునాగారం/మంగపేట, డిసెంబర్ 16 : రాష్ట్రంలోని ఐటీడీఏల పరిధిలో నిర్వహించే గిరిజన ప్రజావాణి కార్యక్రమాల్లో నాయకులు పాల్గొని, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏటూరునాగారం మండల కేంద్రంతో పాటు మంగపేట మండలం తిమ్మంపేటలో శనివారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించేలా పనిచేయాలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి, విద్యా రంగాల్లో అభివృద్ధి కోసం సంఘాలు కృషిచేయాలన్నారు. జల్, జంగిల్, జమీన్ పరిరక్షణ అందరి బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 29 శాఖల జీవోలన్నీ కలిపి ప్రత్యేక చట్టం చేయాలని, లంబాడాల సమస్యలపై కమిషన్ వేయాలని అరుణ్‌కుమార్ కోరారు.



**మంగపేట అధ్యక్షుడిగా సారయ్య**

మంగపేట : రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో తుడుందెబ్బ మంగపేట మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎట్టి సారయ్యదొర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుర్సం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా కొమురం పుల్లారావు, కోశాధికారిగా కబ్బాక మహేశ్, సహాయ కార్యదర్శులుగా బోదెబోయిన హన్మంతరావు, కొమురం నర్సింహారావు, సెగ్గెం ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో చందా రఘుపతి, నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, అన్నెబోయిన సమ్మయ్య, పొదెం నగేశ్, చర్ప లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.